# కారు కోసం

కొమరగిరి పట్నంలో విశ్వపతిగారింట వివాహం. రాత్రి ఒంటిగంటా మూడు నిముషాలకి లగ్నం పదిన్నర దాటింది. ఆపాటికి విడిదిలోంచి మగ పెళ్లివారు ఊరేగటానికి బయల్దేరవలసిందే మరి. కొమరగిరిపట్నం, పేరుకు పట్నంగాని చూస్తే చిన్న గ్రామమే, ఐతేం, భోగంమేళంతో ఊరేగటం కనక నాలుగు వీధులూ తిరిగొచ్చేటప్పటికి ఎంతలేదన్నా ఒంటిగంట ఇట్టే ఐపోతుంది. అలాంటప్పుడు వెంటనే తెముల్చుకు బయల్దేరక, అలా కూచుండి పోయారెందుకు చెప్మా ?

విడిదిలోకివెళ్ళి వియ్యంకుడుగార్ని కాస్త తొందరపెట్టటం ఎందుకేనా మంచిదని తోచింది విశ్వపతిగారికి. ఆయనవెళ్లి 'బావగారూ, ఈపాటికి ఊరేగింపు ప్రారంభిస్తేగాని...' అని మొదలెట్టాడు. పద్మనాభంగారు అడ్డువచ్చి, 'ఈపాటికికాదు, గంటక్రితమే బయల్దేరుదామనుకున్నాను. కాని వెళ్ళిన పెళ్లికొడుకు ఇంతవరకూ పికరులేడు!' అన్నాడు. విశ్వపతి నిర్ఘాంతపోయాడు. 'పెళ్లికొడుకు పికరు లేకపోవటమేమిటి? ఎక్కడికి వెళ్ళాడు?'

'వాడు ఎక్కడికి వెళ్ళాడో, ఈయన ఎందుకు పంపాడో, యీ పెద్దమనిషినే అడగండి!' అంటూ పద్మనాభంగారు కసి వెల్లడౌతూన్న ముఖంతో విశ్వపతిగారికి తన పెద్ద బావమరిది వెంకటేశంగారి వైపు చూపించాడు. బల్లమీదున్న రోజాయిపై పడుకుని చుట్ట కాల్చుకుంటూన్న వెంకటేశంగారు వెంటనే లేచి కూచుని దగ్గు ప్రారంభించాడు. వచ్చిన కన్యాప్రదాతకూ, కోపంగాఉన్న పద్మనాభానికీ యేంచెప్పాలో ఆలోచన తట్టేవరకూ దగ్గేసి, అప్పుడు మెల్లిగా ప్రారంభించాడు—

'పద్దన్న బావా, సంగతేదో చెప్పక నువ్వు అనవసరంగా కంగారు పడిపోయి వీరినిలా కంగారు పెట్టేస్తావెందుకు?...దయచెయ్యండి తమ్ముడు గారు, ఇలా కూచోండి. మా రంగధామం అమలాపురం వెళ్ళాడు మధ్యాహ్నం స్నాతకం అవటంతోనే వెళ్ళాడు. సాయంత్రం పడకుండానే రావలసింది మరి. ఎందుచేత ఆలస్యమైందో. మా బావ కంగారుగానీ తప్పకుండా వచ్చేస్తాడు.'

పద్మనాభానికి కోపం ఆగలేదు. 'స్నాతకం పెళ్ళికొడుకు దీక్షగా ఒకచోట కూచోక ఊళ్ళమ్మట బయల్దేరటా యేమిటంటాను. ఆయన వెడతాననటం, ఈయన వెళ్ళమనటం సరిపోయింది!' అని ఒక్క విసురు విసిరేడు. వెంకటేశం మళ్ళీ రెండు నిముషాలు దగ్గి గొంతుక సవిరించుకుంటూ "ఇప్పుడు వాడింకా రాకపోవటంవల్ల ఆదుర్దాగా ఉండి ఇలా అనిపిస్తోంది గాని, వాడు వెళ్ళేటప్పుడు ఇలా అనుకున్నామా, బావా? 'ఎంతసేపు? బస్సులో వెళ్ళి చక్కా వస్తాడనుకున్నాం." అన్నాడు. విశ్వపతిగారు, 'ఏంపనిమీద పంపారు అన్నగారూ? మరొకర్ని ఎవరినైనా పంపలేకపోయారా? నాతో సెలవిస్తే నేను ఎవరినైనా పంపిఉందునే?' అన్నాడు వెంకటేశం యీమాటు దగ్గలేదు. 'వాడే చేసుకోవలసినపని బాబూ అది. ఏమిటో మనవిచేస్తా చిత్తగించండి. మా రంగడు బి. యల్. పట్టా పుచ్చుకుని అమలాపురంలో ప్రాక్టీసు పెట్టాక వచ్చిన మొట్టమొదటి కేసుట ఇది. సరిగ్గా అది యీనాడే హియరింగుకు రావాలా చెప్పండి. మన ఆదుర్దాకోసం కాకపోతే? వస్తేం, మరోనాటికి వాయిదా వేయించుకోవచ్చు. నేనలాగ వేయించుకోమనే అన్నాను. కాని ఆ మునసబెవరో కర్కోటకుడనీ, వాయిదాలివ్వడనీ, అందులో తనలాంటి కుర్రవాళ్ళంటే ఆయనకు అసలే లక్ష్యం లేదని...ఇలా ఏవేవో అభ్యంతరాలు చెప్పుకొచ్చాడు. వీటికేంగాని ఇవేళ ఎలాగైనా వెళ్ళి ఆ కేసు వాదించి నెగ్గెయ్యాలన్న ఉబలాటం, ఉత్సాహం వాడిలో కనపడి, వాణ్ణి ఆపటంకన్న పంపటమే మంచిదనిపించింది. చెప్పకపోవటమేం? మా పద్మనాభం వద్దంటూంటే, 'పోనీ వెళ్లి రానియ్' అన్నాను నేనే. ఎందుచేత రాలేదో మరి, నాకూ యేమీ పాలుపోవటంలేదు. ఆఖరి బస్సు వచ్చిందా?'

'ఆఖరి బస్సు వచ్చి రాత్రి ఏడింటికే వెళ్ళిపోతుంది.' అన్నాడు విశ్వపతి గద్గదికతో. వెంకటేశం ఇంక తను మాట్లాడవలసినదేమీ లేదు గనక మళ్లీ దగ్గు దొరకబుచ్చుకుని, ఆయాసంకూడా రావటంవల్ల, రొజాయి పైన నడుం వాల్చాడు. పద్మనాభంగారు మాట్లాడకుండా పందిరికేసి చూస్తూ కాగితపు బుట్టలసంఖ్య లెక్కపెట్టడం మొదలెట్టాడు. విశ్వపతి ఏమీ తోచక ఇంటికి తిరిగొచ్చి భార్య సావిత్రమ్మతో అంతా చెప్పి, అంతవరకూ అణిగివున్న కోపాన్ని కక్కుతూ, వెంకటేశాన్ని, పద్మనాభాన్ని, మునసబునీ, కోర్టునీ, దావాలనీ, పార్టీలనీ తిట్టటం ఆరంభించాడు.

* * * * *

అమలాపురం మునసబుకోర్టులో రంగధామారావు బాగా వాదించి తన మొదటికేసు నెగ్గాడు. అతగాణ్ణి తోటి యువక ప్లీడర్లంతా అభినందించారు. పార్టీ కృతజ్ఞత వెల్లడిచేసి, వెళ్ళిపోయాడు. కేసు నెగ్గామన్న సంతోషంలో రంగధామం, వాళ్లతోనూ వీళ్ళతోనూ కబుర్లుచెపుతూ వెళ్ళినడకలతో బస్సుస్టాండు కొచ్చేటప్పటికి పదినిముషాలు తక్కువ ఆరుగంటలైంది.

అమలాపురంనుంచి కొమరగిరిపట్నం వెళ్లే ఆఖరిబస్సు సరిగ్గా ఆరుగంటలకే బయల్దేరుతుంది. పదినిముషాలు ముందుగానే రాగలిగినందుకు సంతోషించాడు రంగధామం. కాని స్టాండులో బస్సులేదే? ఎక్కడికి పోయింది? వచ్చేలోగ కాఫీ తాగివద్దాం పోనీ,' అనుకుంటూ ఎదురుగావున్న హోటలుకి వెళ్ళాడు; కాఫీతాగి వచ్చాడు. కాని బస్సు రాలేదు, వాకబుచేశాడు కొమరగిరిపట్నంవైపు వెళ్ళవలసినవాళ్ళే నలుగు రైదుగురు తారసబడ్డారు. "బస్సు వచ్చిందండి, కాని ముమ్మిడివరం వెళ్లింది. ఒక గంటలో తిరిగొస్తాం. అప్పుడుగాని కొమరగిరిపట్నానికి ట్రిప్పులేదు' అని చెప్పి తీసుకుపోయాడు డ్రైవరు."

ముమ్మిడివరం రూటుకి ఆనాడు అంతగిరాకీ తగలటానికి కారణం. అక్కడ వెలిసిన బాలయోగి అన్న సంగతి అందరికీ తెలిసిందే. రమణ మహర్షి వల్ల తిరువణ్ణామలకీ, అరవింద యోగివల్ల పుదుచ్చేరికీ వచ్చిన ఘనత కన్న బాలయోగి మూలాన కోనసీమలోని ముమ్మిడివరానికి ఆకాలంలో ఎక్కువ కీర్తివచ్చింది. బాలయోగి దర్శనం ఇస్తాడని తెలిసే లక్షలాదిజనం అటు విశాఖనుంచీ ఇటు నెల్లూరునుంచి కూడా వెళ్ళారు. అడిగిన రేటు కన్నా ఎక్కువిచ్చి కనపడ్డ బండ్లన్నీ కట్టించుకుపోయారు. కొమరగిరిపట్నం వైపునుంచి వచ్చిన బళ్ళుకూడా తిరిగిపోక, ముమ్మిడివరం దారిపట్టాయి. బాలయోగి మహత్తు ఆ రోజున ప్రజలచేత విరివిగా ధనాన్ని ఖర్చు పెట్టించింది. ధనంయొక్క మహత్తు బళ్ళవారిచేత ముమ్మిడివరానికి పదేస్పెషల్ ట్రిప్పులు వేయించింది. గుర్రాల క్షేమం, ఎద్దుల క్షేమం ఆలోచించిన బండివాడే లేడా నాడు.

రంగధామం యేమీ కంగారు పడలేదు. ముమ్మిడివరంనుంచి వచ్చాక కొమరగిరిపట్నం తీసుకు వెడతానన్నాడుగా బస్సు డ్రైవరు? ముమ్మిడివరం వెళ్లి రావటానికి ఒక గంటకన్న యెక్కువ పట్టదు. కొమరగిరిపట్నం యేడు గంటలకు చేరుకోవలసినది యెనిమిదింటికి చేరుకోవడ మౌతుంది. ఒక్క-

గంటేగా ఆలస్యం ? అంతలో మునిగిందేమీ లేదు. ఈ ఆలోచనతో అతగాడు పేపరు కొనుక్కుని, సోడాకొట్టు ముందున్న కుర్చీపీటమీద చతికిలపడి, చదవటం ప్రారంభించాడు.

గంట అయిందిగాని బస్సురాలేదు. మరికాసేపు ఎదురుచూసి, 'ఊరికే కూచోటమెందుకు? భోజనంచేసి వద్దాం'అని హోటల్లోకి వెళ్ళాడు. భోజనం కానిచ్చి వచ్చాడుగాని బస్సురాలేదు. కొమరగిరిపట్నంవైపు వెడదామనుకున్న మిగతావాళ్లు యేమయ్యారోగాని అక్కడ కనపడలేదు. బస్సు వస్తుందా, రాదా? వెళ్లి ముమ్మిడివరంలోనే దిగడిపోయిందేమిటి ఖర్మం? సోడాకొట్టువాణ్ణి సలహా అడిగాడు. 'రాకేం చేస్తుందండీ, వచ్చేస్తుంది' అన్నాడు వాడు.

కాని బస్సు రాలేదెప్పటికీ. రిపేరు ఏదో వచ్చి దారిలో మొండికేసి ఉంటుంది. ఎనిమిదిన్నర దాటిపోయిందప్పుడే ఇంక ఆలస్య చెయ్యకూడదు మనోహరిదీ మరోహరిదీ కాదు. సొంతపెళ్ళి ఆయిరి! ఏదో ఓ బండి చూసుకుని వెంటనే కొమరగిరిపట్నం చేరుకోవాలి. ఈ ఆలోచన బాగానే ఉందిగాని బండి యేది? స్టాండులో ఒక్కబండికూడా లేదు. మునసబుకోర్టు, సబుకోర్టు, ఇంకా ఇంకా పెద్ద పెద్ద ఆఫీసులు ఎన్నో ఉండి తాలూకా హెడ్‌క్వార్టర్సుగా వున్న అమలాపురానికంతకీ ఒక్క టాక్సీ ఐనా యేడిసిందికాదు. పోనీ, ఎంతకైనా ఇచ్చేసి అరగంటలో చేరుకునే ఉండును కొమగిరిపట్నం! రంగధామం తన ఆవస్థలో అలాగ అనుకున్నాడేకానీ, నిజంగా ఆ ఊళ్లో టాక్సీలే వుంటేమటుకు అతగాడికోసం కూచునేవా? బస్సూ, బస్సులతోబాటు అవీ ముమ్మిడివరమే పోయి ఉండేవి!

తొమ్మిదయింది. రంగధామరావుకి తొందర యెక్కువయింది. కారుగలవాళ్ళ నెవరినైనా బ్రతిమాలితే? 'ఈ రాత్రి నాకు పదమూడు మైళ్ళ దూరంలో వివాహం. ఇక్కడ ఇలా బండీ, బస్సూ లేక చిక్కుకుపోయాను. కటాక్షించాలి' అంటే గుండె కరిగి వాళ్లు ఇవ్వకపోతారా? కానైతే, 'పెళ్లి ముందుపెట్టుకుని ఏం మునిగిపోయిందని వచ్చావిక్కడికి?' అని రెండు చీవాట్లు వేస్తారు. అంతేగా? కానీ కార్లున్నవాళ్లల్లా ఇద్దరే ఆ ఊరికంతా. సబ్‌జడ్జీకుంది. డాక్టరుకుంది. వాళ్లిద్దరికీకూడా తన మొహ

మైనా తెలవదు. ఎలాగ అడగటం? ఎలాగో అడిగి వాళ్ళచేత 'సరే' అని
పించుకున్నా డ్రైవర్లుంటారో ఉండరో? అన్నట్లు డాక్టరుకు వేరే డ్రైవరు
న్నట్లేలేదు. ఆయన డ్రైవ్ చేసుకు పోతూంటాడు. కారు ఇస్తానన్నది
చాలక మీరే డ్రైవ్ చేసి దిగబెట్టండంటే యేం బాగుంటుంది? బాగుండే
దేమిటి? పని జరుగుతుంటే బాగోగులమాట చూడక్కర్లేదు...విధంచెడ్డా
ఫలందక్కుతుందా అని?...రంగధామాని కంతటి ధైర్యం కలగలేదు.
'మీనమేషా లెక్కపెడుతూ ఇక్కడ నిలబడితే యేంలాభం? పదికావ
స్తోంది. ఆరుగంటలకే మెల్లగా నడక మొదలెడితే యీపాటి కెలాగో
కొమరగిరిపట్నమే చేరుకుని ఉందును. దిక్కుమాలిన బుర్ర పనిచేసిందికాదు'
అనుకుంటూ అతగాడు కొమరగిరిపట్నం రోడ్డు పుచ్చుకుని నడక ప్రారంభిం
చాడు. 'జన్మలో ఎన్నడూ పట్టుమని పదిఫర్లాంగులు నడవని నాకు పెళ్లి
నాడీ నడక ఖర్మమేమిటి? తప్పనిసరి గనక కాళ్ళీడ్చుకుంటూ నడిస్తే,
లగ్నంవేళకి చేరుకోగలనన్న ధైర్యంకూడా లేదు. ఆ హీయరింగు ఇవాళే
రావాలా? వస్తే మాత్రం యెవళ్ళఖర్మం వాళ్లదని ఊరుకోక నే నిక్కడకు
తయారవటం యేమిటి? దిక్కుమాలిన బుర్ర సరిగా పనిచేసిందికాదు.'
అని తిట్టుకోటం మొదలెట్టాడు. 'నన్ను తిడితే యేంలాభం స్వామీ?
జరిగినదాని కనుకుని యేంలాభం? ఇప్పుడు నన్ను సరిగా ఉపయోగించి పని
సాధించండి' అంది ఆ బుర్ర. అప్పటి కాతడు సుబ్బరాయుని గుడివరకూ
వచ్చాడు. ఒక వందగజాల దూరంలోనే డాక్టరు బంగళా కనపడింది.
ఆలోచిస్తూ అడుగులువేసి డాక్టరింటి కెదురుగా నిలబడ్డాడు. అంతా పడు
కున్నట్లున్నారు; నిశ్శబ్దంగా ఉంది. ఒక్క క్షణం తటపటాయించి,
'ఏమైతేకానియ్. చూద్దాం' అనుకుంటూ గుమ్మంలెక్కి వెళ్ళి తలుపు
తట్టాడు.

* * * * *

కొమరగిరిపట్నంలో కన్యాప్రదాత విశ్వపతిగారు తనకు చేతనైన
తిట్లన్నీ తిట్టేసి, చేసేదేమీలేక మళ్ళీ విడిదిలోకి వెళ్లాడు. 'ఏమండీ,
వచ్చారా, పెళ్లికుమారుడుగారు?' అన్నట్లుగా పలకరించాడు, వచ్చిఉండడని
తెలుసుండి కూడా. ఏమాటంటే యేం ఉప్పెన వస్తుందో అని అంతా నిశ్శ
బ్దంగా ఉన్నారు. పెళ్లివిడిదిలాగే లేదక్కడ. 'ఈ లగ్నానికి పెండ్లి జరుగు

తుంకో లేదో!' అన్న ఆదుర్దాతో కూచుండిపోయారు. గడియారంమాత్రం 'నన్నెవరు అడ్డుపెట్టగలరు?' అన్నట్టు ఒక్కటైనా మానకుండా పదకొండు గంటలూ కొట్టేసింది. విశ్వపతికి కళ్లనీళ్లపర్యంతం వచ్చింది. ఆయనేదో అనబోతూంటే పద్మనాభంగారే అన్నారు. "బావగారూ, నేనేం చెయ్యను చెప్పండి? ఏయింట్లో పెత్తనమైనా ఒక చేతిమీదుగా వెళ్లాలికాని, అందరిదీ తలో పెత్తనం పనికిరాదు. నేను 'వెళ్లొద్దు' అన్నప్పుడు 'ఫరవాలేదు వెళ్లిరానియ్యి' అని పంపడమేమిటి?" ఆ విసురు తనమీదే అని వెంకటేశంగారు గ్రహించి, తనమీదకూడా కొంత తప్పు వుందిగనుక, ఏమీ మాట్లాడలేదు. వచ్చే దగ్గును ఆపుకుందామనికూడా ప్రయత్నించాడు కాని, దాని తస్సాగొయ్యి, ఆ దగ్గుమాత్రం ఆగిందికాదు.

సరిగ్గా ఆ సమయానికే పందిట్లోకి ఓకారువచ్చి ఆగింది. అందరికళ్లూ అటువైపు తిరిగాయి కారులోంచి ముందు రంగధామరావు డాక్టరుగారి మందుల బాగ్ పుచ్చుకుని దిగాడు. కారు డ్రైవ్ చేసుకొచ్చిన డాక్టరు గిరి స్టెతస్కోపు చేతబట్టుకుని వెనకాలే వచ్చాడు. అంతా రంగధామరావుని ఏమిటేమిటో అడగబోయారుగాని అతగాడు, 'ఉష్' అంటూ మాట్లాడనిచ్చాడుగాదు. డాక్టర్ని యెకాయెకీని వెంకటేశంగారి బల్లవద్దకు తీసుకుపోయాడు. ఆయన 'ఎవరురా ఈయన? డాక్టరులా గున్నాడే! ఈయన పనేమొచ్చిం దిప్పుడు?' అని అడగబోయాడు. కాని, ఆ దగ్గు అడ్డొచ్చి ఏమీ అడగనిచ్చిందికాదు. ఆయన లేవబోయాడుగాని డాక్టరు 'కదలకండి, అలాగే పడుకోండి' అని ఆజ్ఞాపించి, ఆయన ఊపిరితిత్తులు రెండు పరీక్షించి, బాగ్ తెరిచి ఇంజక్షనివ్వటానికి సన్నాహమంతా చేశాడు. అందరూ నిర్ఘాంతపోయి నిశ్శబ్దంగా నిలబడి చూస్తోంటే, మరో నిముషానికి వెంకటేశంగారు ఏదో అనబోతున్నా వినిపించుకోక, డాక్టరు ఆయనకు ఇంజక్షను ఇచ్చేసి, బాగ్ సర్దుకున్నాడు. 'వస్తానండి. మీరనుకున్నంత ఫరవాలేదు. రాత్రి నిద్ర బాగా పడుతుంది అవసరమనితోస్తే రేపు కబురుచెయ్యండి' అంటూ వెళ్లి, కారుఎక్కి స్టార్టుచేశాడు. రంగధామరావు చరచరా వెళ్లి, మూడు ఐదు రూపాయల నోట్లు ఆయన చేతిలోపెట్టి, 'థాంక్యు సార్. ఆపదలో అడ్డుపడ్డారు పెళ్లి ఆగిపోతుందని ఆదుర్దాపడ్డామంతా' అన్నాడు. డాక్టరుగారి కారు హారన్ చప్పుడుచేస్తూ వెళ్లిపోయింది.

రంగధామం లోపలికి రావటంతోనే, వెంకటేశంగారు ఇంజక్షనిచ్చినచోట తడుముకుంటూ, కళ్లెర్రజేసి, 'ఏమిట్రా ఇదంతా?' అన్నాడు.

"ఏం లేదు మామయ్యా, బాలయోగిమూలాన్ని బస్సులూ, బళ్లూ అన్నీ ముమ్మిడివరం చక్కాపోతాయి. 'లగ్నం వేళకి అందుకోలేను. కాస్త మీ కారులో తీసుకువెళ్లి దిగబెట్టి రావాలి' అని డాక్టర్ని బ్రతిమాలుదామని గుమ్మమెక్కాను. కాని నిద్రలోంచి విసుక్కుంటూ లేచివచ్చిన ఆయన ముఖం చూచేటప్పటికి నాకు భయంవేసింది. 'నేను టాక్సీవాణ్ణా, వచ్చి నిన్ను దిగబెట్టటానికి'ని మొహం తగలేసి, తలుపు మూసుకుంటాడేమో అనిపించి, ఆయన్ని లాక్కురావటానికీ యెత్తు వేశాను. ఐతేం, ఒక్క అబద్ధం కూడా చెప్పలేదు. 'మా మామయ్యకి దగ్గుగా ఉంది. ఈ రాత్రి ఒంటిగంటకి నా పెళ్లి. మీరు ఇప్పుడు రాకపోతే నా పెళ్లి అడ్డిపోతుంది' ఇందులో అబద్ధమేముంది మామయ్యా ?"

"ఏం లేదురా ఎటొచ్చీ ఆయన నా దగ్గుమూలాన్ని నీ పెళ్లి అడ్డిపోతోందనుకుని వచ్చి, నాకు యీ ఇంజక్షనిచ్చి వెళ్ళాడు. మంచి ఎత్తు వేశావురా రంగా. నువ్విలా ఇక్కడకు చేరుకోకపోతే నీ పెళ్లిమాటకేంగాని వీళ్ళంతా జేరి నా పెళ్లి చేసేద్దురు !...వెళ్లు. ఇంక ఆలస్యం చెయ్యక ఊరేగింపుకు ముస్తాబు చేసుకో" అన్నారు వెంకటేశంగారు.